





అంకాలమ్మకోటకు చేరుకునే జలమార్గంలోని ప్రకృతి అందాలు

కొండ కోనల్లో కోట..!

జీవ వైవిధ్యానికి మారుపేరుగా నిలిచిన నల్లమల అడవుల్లో అనేక పురాతన పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా ఎన్నో ప్రాచీన కట్టడాలు నల్లమలలో ఒదిగి ఉన్నాయి. అయితే వీటిలో ఇప్పటికీ పలు కట్టడాల గురించి బయటి ప్రపంచానికి, పురావస్తు శాఖ నిపుణులకు తెలియదు. అలాంటి అరుదైన పురాతన నిర్మాణాల్లో నల్లమలలోని అంకాలమ్మ కోట ఒకటి. కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల సరిహద్దులోని ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో కృష్ణా నది ఒడ్డున 600 మీటర్ల ఎత్తయిన కొండపై అంకాలమ్మ కోట నిర్మించారు. 14వ శతాబ్దంలో కాకతీయ రాజుల్లో ఒకరైన ప్రతాపరుద్రుడు హయాంలో ఈ కోటను నిర్మించినట్లు తెలుస్తోంది. కోట చుట్టూ మూడు వైపులా నీరు ద్వీపకల్పంగా ఉంటుంది. కోటను చేరుకునేందుకు ఒకే ఒక మార్గం ఉండేలా నిర్మించారు. యుద్ధ సమయాల్లో శత్రువులను దీటుగా ఎదుర్కొనేందుకు, సంపదను దాచుకునేందుకు వీలుగా ఈ కోటను నిర్మించినట్లు అక్కడి ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్నా సాధారణ ప్రజలకు తెలియని అంకాలమ్మకోట చరిత్ర గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

6లో..

- సంఘాల్లో కంప్యూటరీకరణకు అక్టోబరు 2తో ముగిసిన గడువు
- తమవల్ల కాదంటూ తెగేసి చెబుతున్న సంఘాల సీఈవోలు
- ఖర్చులు మాత్రం తడిసి మోపెడు..
- ఒక్కరూపాయి ఇవ్వలేమంటున్న అధికారులు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4 లక్షల మంది రైతుల ఎదురు చూపు



కంప్యూటరీకరణ పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన పసుపుల సహకార సంఘం

కంప్యూటరీకరణ సగమే

పూర్తయితేనే రైతులకు రుణాలు

సహకార సంఘాల్లో రైతులకు అందిస్తున్న రుణాల పంపిణీలో అక్రమాలను నియంత్రించేందుకు దశాబ్ద కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంప్యూటరీకరించాలని ఆలోచిస్తున్నాయి. ఇది పూర్తయితే.. తమ ఆటలు సాగవని ఒక్క రూపాయి కూడా జేబులో వేసుకునే అవకాశం ఉండదని సహకార సంఘాల చైర్మన్లతో పాటు వారికి అండగా నిలుస్తున్న రాజకీయ నాయకులు కంప్యూటరీకరణకు ఎప్పటికప్పుడు మోకాలడ్డుతూ వస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అక్టోబరు 2 నాటికి కంప్యూటరీకరణ చేపట్టాలని, తమ వాటాగా దాదాపు రూ.1,500 కోట్లను అందించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా మరో రూ.600 కోట్లను అందిస్తుందని అధికారులు తెలిపారు. అయినా సహకార సంఘాల్లో అక్టోబరు 10వ తేదీ గడిచిపోయినా కంప్యూటరీకరణ మాత్రం పూర్తి కాలేదు. 99 సహకార సంఘాల్లో ఇప్పటికీ 50 శాతం వివరాలు మాత్రమే కంప్యూటరీకరణ జరిగినట్లు జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈవో విజయకుమార్ తెలిపారు. ఈ నిధులు ఏ మూలనకు సరిపోవని రాజకీయ నాయకులను కాదని తాము కంప్యూటరీకరణ ఇప్పటికిప్పుడు పూర్తి చేయలేమని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సీఈవోలు స్పష్టం చేస్తున్నారు. తక్కువ సమయంలో ఈ ప్రక్రియను పూర్తి చేయలేమని, సంఘాలు ఏర్పడినప్పటి నుంచి ఇప్పటిదాకా రుణాలు తీసుకున్న రైతుల వివరాలన్నీ కంప్యూటర్‌లో నమోదు చేయాలంటే కష్టసాధ్యమని వారు చెబుతున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ నాయకుల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో సంఘాల కంప్యూటరీకరణకు శ్రీకారం చుట్టింది. దీని కోసం రూ.2వేల కోట్లకు పైగానే నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు ఆరున్నర లక్షల మంది రైతులు సభ్యత్వం తీసుకున్నారు. ఇప్పటి దాకా ఏటా రూ.100 నుంచి రూ.200 కోట్ల దాకా పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు రైతులకు అందిస్తూ వచ్చారు. ఈ రుణాల మంజూరు, వసూళ్లు ఇప్పటి దాకా ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లోనే లావాదేవీలు జరుపుతుండటంతో రాజకీయ నాయకులు ఆడింది ఆట.. పాడింది పాటగా కొనసాగుతూ వస్తున్నది. వారి పుణ్యమా అని ఎంతో మంది సంఘాల్లోని సీఈవోలు బలిపశువులుగా మారారు. కేంద్ర సహకార బ్యాంకు అధికారులు కూడా సస్పెండ్ అయి.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులన్నింటినీ చక్కదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం అక్టోబరు 2 నాటికి సహకార సంఘాల్లో కంప్యూటరీకరణను పూర్తి చేయాలని లక్ష్యం విధించింది. అక్టోబరు 10వ తేదీ వచ్చినా కూడా వివిధ కారణాలు ఎత్తి చూపుతూ సహకార సంఘాల్లో సీఈవోలు 40 నుంచి 50 శాతం మాత్రమే కంప్యూటరీకరణ పూర్తి చేశారు. మిగిలిన పని పూర్తి కావాలంటే ప్రభుత్వం గడువు పెంచక తప్పదని ఆయా సహకార సంఘాల సీఈవోలు స్పష్టం చేస్తున్నారు.

రేయింబవళ్లు పని చేస్తున్నా, ఖర్చులు తడిసి మోపెడవుతున్నా.. తమ కష్టాన్ని జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సంఘాల సీఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం లేదా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు కంప్యూటరీకరణకు ఏ మాత్రం నిధులు సరిపడ ఇవ్వడం లేదని, దీంతో తమ జీతాల నుంచి ఖర్చులు భరించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని 99 సహకార సంఘాలకు పంట రుణాల కోసం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూ.15 కోట్లను విడుదల చేసింది. ఒక్కో సంఘానికి పొలాలు ఉన్న రైతులకు రూ.10 లక్షలు, కౌలు రైతులకు రూ.15 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఇప్పటికీ ఖరీఫ్ ఇచ్చిన గడువు ముగిసిపోయినా ఏ సహకార సంఘాల్లో కూడా ఒక్క రూపాయిని రైతులకు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. కొన్ని సహకార సంఘాల పరిధిలో రాజకీయ నాయకులు, వారి అనుచరులు కంప్యూటరీకరణను పక్కన పెట్టేసి రైతులకు రుణాలు ఇవ్వాలని సంఘాల సీఈవోలపై ఒంటికాలిపై లేస్తున్నారు.



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

ఖరీఫ్ రుణాలు లేనట్లే

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు కోసం రూ.15 కోట్లను జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కేటాయించింది. అయితే.. ఈ రుణాలను ఇప్పటి దాకా అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.5లకు పైగానే వడ్డీతో వ్యాపారుల నుంచి అప్పులు తీసుకుంటున్నామని, పంటలు సక్రమంగా చేతికి అందితేనే ఈ అప్పులను తీర్చగలుగుతామని, లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు గాని, సహకార సంఘాల సీఈవోలు గాని తమ ఆర్తనాదాలు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని అంటున్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం సహకార బ్యాంకు అధికారుల నత్తనడకనే ఈ పరిస్థితికి కారణమని రైతులు ధ్వజమెత్తుతున్నారు.

మిగతా 6లో..

నేడు పీజీఆర్ఎస్ ద్వారా ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీన సోమవారం నంద్యాల కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్‌గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఈ నెల 21వ తేదీ ఉదయం 9.30గంటలకు జిల్లా అధికారులంతా హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

పోలీసు అమర వీరులకు వందనం

- శాంతి భద్రతల పర్యవేక్షణలో వారే కీలకం
- ఒత్తిడితో సతమతమవుతున్న పోలీసులు
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

7



ఆగిన తల్లి గుండె

- రెండేళ్ల క్రితమే గుండెపోటుతో తండ్రి మృతి
- తల్లి మృతితో అనాథలైన పిల్లలు

7

ఉమామహేశ్వర స్వామి సన్నిధిలో ఏపీఈఆర్‌సీ చైర్మన్

బనగానపల్లె, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. నాగార్జునరెడ్డి దంపతులకు ఆలయ ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కాశీంబాబు, ఆలయ పూజారులు, విద్యుత్ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జస్టిస్ నాగార్జునరెడ్డి దంపతులు యాగంటి ఉమామహేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. యాగంటి ఉమామహేశ్వరస్వామి చరిత్రను పూజారులు వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలు నాగార్జునరెడ్డికి అందించారు. జస్టిస్ నాగార్జునరెడ్డికి ఉమామహేశ్వరస్వామి చిత్రపటాన్ని వారు అందించారు.



జస్టిస్ నాగార్జునరెడ్డికి ఉమామహేశ్వరస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో

యాగంటి ఆలయ ఈవోగా చంద్రుడు

బనగానపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఆలయ ఈవోగా చంద్రుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. యాగంటి ఈవోగా నియమితులైన డీఆర్‌కేవీ ప్రసాద్‌ను సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో ఈవోగా చంద్రుడును నియమించారు. గతంలో ఈయన గ్రూప్ ఆలయాల ఈవోగా ఉండేవారు. ప్రస్తుతం యాగంటి ఈవోగా నియమించడంతో ఈమేరకు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఆలయ పూజారులు సత్కరించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రుడు

శ్రీశైల జలాశయం 6 గేట్ల ఎత్తివేత

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

శ్రీశైలం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోంది. జలాశయానికి వరద భారీగా కొనసాగుతుండడంతో ఆదివారం డ్యాం అధికారులు 6 క్రస్టుగేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జున సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,28,368 క్యూసెక్కులు, సుకేసుల నుంచి 67,312 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కులు మొత్తం 1,95,929 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,25,641 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తిస్థాయి నీటిమట్టం 884.80 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 211.4250 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,698 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. జలాశయం ఆరు క్రస్టుగేట్ల ద్వారా 1,67,898 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

పర్యాటకం

కొండ కోనల్లో కోట


కోటపై పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి


కోట చుట్టూ ఉన్న ఎత్తైన ప్రహరీ


అంకాలమ్మకోటకు చేరుకునే జలమార్గంలో కనిపించే ప్రకృతి అందాలు


నల్లమలలోని ఈ కొండపైనే అంకాలమ్మ కోట ఉండేది

- 14వ శతాబ్దం నాటి అతిప్రాచీన కట్టడం
- నల్లమలలో శత్రు దుర్భేద్యమైన నిర్మాణం
- కోట చుట్టూ అద్భుతమైన ప్రకృతి శోభ
- బయటి ప్రపంచానికి తెలియని ప్రదేశం
- వంద ఎకరాలకు పైగా విస్తరించిన వైనం


ఆలయంలో కొలువుతీరిన అంకాలమ్మ తల్లి


కోటలోకి చేరుకునే ప్రధాన ద్వారం శిథిలమైన దృశ్యం

ఆత్మకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది చెంతనే చుట్టూ నల్లమల ప్రకృతి అందాల నడుమ అంకాలమ్మ కోటను అద్భుతంగా నిర్మించారు. శత్రువులను ఎదుర్కొనేందుకు 600 మీటర్ల ఎత్తులో అతికష్టంతో కోటను నిర్మించినట్లు తెలుస్తోంది. సుమారు వంద ఎకరాలకు పైగా విస్తరించిన ఈ కోటలోకి ఎవరూ ప్రవేశించకుండా ఉండేందుకు చుట్టూ ఐదు కిమీల మేర పది అడుగుల ఎత్తు, నాలుగైదు అడుగుల వెడల్పుతో పటిష్టమైన ప్రహరీ నిర్మించారు. అంతేగాకుండా కోటకు చేరుకునేందుకు ప్రధాన ద్వారాన్ని కూడా ఎంతో పకడ్బందీగా నిర్మించారు. ఈ కోటలోనే కాళికాదేవి ఆలయాన్ని నిర్మించి పూజించేవారు. కాళికాదేవిని అంకాలమ్మ అని కూడా పిలుస్తారు. ఆమె పేరు మీదుగానే అంకాలమ్మ కోటగా గుర్తింపు పొందింది. ఇక్కడే ఆంజనేయస్వామి, శివాలయాలు కూడా ఉన్నాయి. అలాగే అంకాలమ్మ దేవాలయానికి సమీపంలోనే ఓ పురాతన కోనేరు ఉంది. 600 మీటర్ల ఎత్తులో కొండపై ఉన్న ఈ కోనేరులో అన్ని సీజన్లలో నీరు ఉండటం విశేషం. కాలక్రమంలో ఈ ఆలయం పూర్తి స్థాయిలో శిథిలమైంది. అయితే ఇక్కడి చెంచులు మాత్రం కోటపై మరో ఆలయాన్ని నిర్మించి అంకాలమ్మ తల్లిని పునఃప్రతిష్ఠించి నేటికీ పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీశైల జలాశయం నిర్మాణానికి ముందు కొత్తపల్లి మండలంలోని దుర్గం, ఎర్రమఠం, ముసలిమడుగు, మాడుగుల, జానాల, సంగమేశ్వరం, కపిలేశ్వరం తదితర గ్రామాలకు చెందిన భక్తులు అంకాలమ్మ కోటకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసేవారు. ప్రత్యేకించి అమ్మవారిని కొలిస్తే సంతానప్రాప్తి కల్గుతుందని ఆయా గ్రామాల భక్తుల నమ్మకం. ఆయా గ్రామాల్లో చాలా మందికి అంకాలమ్మ, అంకన్న అనే పేర్లు ఉండడమే ఇందుకు నిదర్శనం.


ప్రకృతి సోయగాల అంకాలమ్మ కోట

కృష్ణానది, నల్లమల కొండలను ఒరుసుకుంటూ అంకాలమ్మ కోటకు చేరుకునే జలమార్గం సందర్శకులకు ఆనందాన్ని కలిగిస్తోంది. కర్నూలు-మహబూబ్‌నగర్ జిల్లాల సరిహద్దులో సోమశిల, అమరగిరి, సిద్దేశ్వరం, జానాల, బలపాలతిప్ప, లింగమయ్యపెంట, మిరపకాయలపెంట, గుండ్లపెంట తదితర అటవీ గ్రామాలను తాకుతూ కృష్ణానది అలల సవ్వడుల నడుమ, ఆహ్లాదకరమైన వాతావరణంలో అంకాలమ్మకోటకు చేరుకోవచ్చు. మార్గమధ్యంలో నల్లమల కొండలు, కోట గోడలు, ప్రకృతి అందాలతో ఆవిష్కరించబడిన అద్భుతమైన రాతి అమరికలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వర్షాకాలంలో నల్లమలలోని కొండలపై నుంచి జాలువారే జలపాతాలు కనిపిస్తాయి. అంతేగాకుండా చీమలతిప్ప తరహాలో పలు దీవులు కూడా కృష్ణానదిలో దర్శనమిస్తాయి.

అంకాలమ్మ కోటకు చేరుకోవడం ఎలా..?


ఎత్తైన కొండపై కోనేరు

కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ కోటను చేరుకునేందుకు ప్రస్తుతం జలమార్గమే శరణ్యం. తెలంగాణలోని కొల్లాపూర్ నుంచి ఎనిమిది కి.మీ. దూరంలో ఉన్న అమరగిరి ప్రాంతానికి చేరుకుని అక్కడి నుంచి మరో పది కి.మీ. దూరం కృష్ణానదిలో ప్రయాణిస్తే అంకాలమ్మ కోటకు చేరుకోవచ్చు. అలాగే కర్నూలు జిల్లాలోని సంగమేశ్వరం నుంచి 15 కి.మీ. మేర కృష్ణానదిలో ప్రయాణిస్తే చీమలతిప్ప సమీపంలో అంకాలమ్మ కోటకు చేరుకోవచ్చు. అయితే కృష్ణా నదిలో నీరు అడుగంటిపోతే కొత్తపల్లి మండలం ముసలిమడుగు గ్రామం నుంచి దోమకుంట, దుర్గం మీదుగా అంకాలమ్మ కోటకు చేరుకోవచ్చు. అది కూడా బైక్‌లు, ట్రాక్టర్లలోనే ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. సంగమేశ్వరం నుంచి శ్రీశైలానికి జలమార్గంలో ప్రయాణిస్తే అంకాలమ్మకోట దర్శనమిస్తుంది. అయితే ఈ కోటకు చేరుకోవాలంటే నల్లమల కొండలపై ట్రెక్కింగ్ చేయాల్సి ఉంటుంది. నాగార్జునసాగర్ -శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో ఉన్న ఈ కోటకు వెళ్లాలంటే తప్పనిసరిగా అటవీ అధికారుల అనుమతులను పొందాల్సి ఉంది.


అంకాలమ్మ కోటపై చెంచులు పునర్నిర్మించిన కాళికాదేవి ఆలయం ఇదే


అంకాలమ్మ కోటపై నుంచి కనిపిస్తున్న సుందరమైన చీమలతిప్ప దీవి

రైతులకు అండగా ప్రభుత్వం

- రైతు బజార్లను సద్వినియోగం చేసుకోండి
- జాయింట్ కలెక్టర్ నవ్య


రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఇందులో భాగంగా రైతుబజార్లను ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య అన్నారు. ఆదివారం నగరంలోని సీ. క్యాంపు రైతుబజారులో జేసీ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏయే గ్రామాల నుంచి రైతులు వస్తున్నారో.. ఏ కూరగాయలను అమ్మకానికి తెస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మీ పొలాల్లో పండించిన కూరగాయలను దళారులకు అమ్ముకుని మోసపోవద్దని, నేరుగా రైతుబజార్లకే వచ్చి గిట్టుబాటు ధరను అందుకుని ప్రయోజనం పొందాలని అన్నారు. రైతుబజార్లల్లో రైతులకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఆ తర్వాతే పొదుపులక్ష్మి మహిళలు, ఇతరులకు అవకాశమని అన్నారు. రైతులను నిర్లక్ష్యం చేసి ఇతరులకు ప్రాధాన్యత కల్పిస్తే తమకు ఫిర్యాదు చేయాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదే విధంగా పొదుపులక్ష్మి మహిళలను ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. రైతుబజారులో రైతులు, పొదుపులక్ష్మి మహిళలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా పొదుపులక్ష్మి మహిళలు, రైతులు వర్షాకాలంలో వర్షం నీరు రైతుబజారులోకి ప్రవేశించి తమకు ప్రయోజనం లేకుండా కూరగాయలు విక్రయించుకునే అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతుబజారు క్రమక్రమంగా రద్దీగా మారుతోందని రోజు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వేలాది మంది వస్తుండటం వల్ల నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని వినియోగదారులు జేసీ దృష్టికి తెచ్చారు. జేసీ వెంట రైతుబజార్ ఎస్టేట్ అధికారి హరీష్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్‌తో పాటు సెక్యూరిటీ గార్డులు శ్రీనివాసరెడ్డి, గురువయ్య, హనుమంతు, గోపాల్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రజనికాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా రెవెన్యూ కార్యవర్గం సమావేశానికి ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెంచలరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఏపీఆర్ఎస్ఏ కృషి చేస్తున్నదన్నారు. అనంతరం ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు.

అంతటా భూ సమస్యలే..!



- గణనీయంగా భూ రికార్డుల్లో తప్పులు
- అత్యధికంగా కల్లూరు మండలంలో 167 సమస్యలు పెండింగ్
- పరిష్కారం కోసం నియోజకవర్గం ప్రత్యేక అధికారులు
- ఉత్తర్వులు జారీ చేసి కలెక్టరు రంజిత్‌బాషా

కర్నూలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):

గ్రామసీమల్లో భూ రికార్డుల్లో తప్పులు తడకలుగా తయారయ్యాయి. రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నా ఎక్కడి ఫైలు అక్కడే..! అన్న చందంగా మారింది. గుట్టల్లా అర్జీలు పేరుకుపోతున్నాయి. ఈ ఏడాది జూన్ 12న సీఎం చంద్రబాబు నాయకత్వంలో కొలువుదీరిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలు సమస్యలు పరిష్కారానికి పెద్దపీట వేసింది. ప్రతి సోమవారం 'ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే చేపట్టడంతో పెద్దఎత్తున భూరికార్డుల్లో తప్పులు చోటు చేసుకున్నాయి. రైతుల పేరిట ఉన్న భూముల రికార్డుల్లో ఇతరుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. భూ కొలతల్లో మాయ చేశారు. అధికారం మాటున నాటి వైసీపీ నాయకులు కొందరు భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అత్యధికంగా ఈ సమస్యలు వెల్లువెత్తున్నాయి. దీంతో ఈ సమస్యల తక్షణ పరిష్కారానికి నియోజకవర్గం ప్రత్యేక అధికారులను నియమించాలని రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు పరిష్కారం కోసం సీసీఎల్ఏ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి పరిష్కరించాలి. సీసీఎల్ఏ ఆదేశాల మేరకు కలెక్టరు పి. రంజిత్‌బాషా నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఎక్కువ సమస్యలు మండలాలపై ప్రత్యేక దృష్టికి పెట్టాలని ఆదేశించారు.

నియోజకవర్గాల వారిగా ప్రత్యేక అధికారులు వీరే

నియోజకవర్గం	అధికారి	హోదా
ఆదోని, ఎమ్మిగనూరు	ఎం.మౌర్య భరద్వాజ్	సబ్ కలెక్టరు ఆదోని
పత్తికొండ	భరత్‌నాయక్	ఆర్డీఓ, పత్తికొండ
కోడుమూరు	కె. సందీప్‌కుమార్	ఆర్డీఓ, కర్నూలు
కర్నూలు	ఎస్. రవీంద్రబాబు	కమిషనర్, కర్నూలు కార్పొరేషన్
మంత్రాలయం	సీహెచ్ విశ్వనాథ్	స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, హంద్రీనీవా యూనిట్-3
ఆలూరు	రామునాయక్	స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, హంద్రీనీవా యూనిట్-4
పాణ్యం	సీవీ నారాయణమ్మ	పీఏ స్పెషల్ కలెక్టరు, ఎస్ఎస్‌పీ, కర్నూలు

కల్లూరు మండలంలో అత్యధికం

టీడీపీ ప్రభుత్వం కొలుదీరి వంద రోజులు పూర్తి అయ్యింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వివిధ గ్రామాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అత్యధికంగా భూ రికార్డుల్లో పేరు మార్పులు, విస్తీర్ణంలో తేడాలు, వంశపారంపర్యంగా వస్తున్న భూముల రికార్డుల్లో మిగులు భూమి, అటవీ భూములు, దేవదాయ భూములు అని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. భూ రికార్డుల్లో తప్పులు సరిచేసి తమకు హక్కు కల్పించాలని 765 మంది రైతులు ఫిర్యాదులు చేశారు. భూ సేకరణ సమస్యలు 362, భూ ఆక్రమణలు 101, ఇంటి స్థలాలు కేటాయించాలని 75 మంది అర్జీలు ఇచ్చారు. అత్యధికంగా కల్లూరు మండలంలో 176, ఆదోని మండలంలో 155, ఓర్వకల్లు మండలంలో 143, దేవనకొండ మండలంలో 100, గోనెగండ్ల మండలంలో 100 సమస్యలు పెండింగులో ఉన్నట్లు తెలుస్తున్నది. వీటితో పాటుగా పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారుల నియామకం ఎంతో కలసి వస్తుందని అంటున్నారు.

మాజీ సైనికుడి ఆవేదన


ప్రకాష్ రెడ్డి

కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన సైనికులకు జిల్లాలో చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని ఒక మాజీ సైనికుడు ఆవేదన వ్యక్తం చేశారు. గోనెగండ్ల మండలం ఒంటరిదిన్నె గ్రామానికి చెందిన ప్రకాశ్ రెడ్డి జూలై 24, 2003 నుంచి 31 జూలై 2022వరకు ఇండియన్ ఆర్మీలో సేవలందించారు. 2010 సంవత్సరం జమ్మూకాశ్మీర్‌లోని పూంచిసెక్టర్‌లో జరిగిన దాడుల్లో కాలుకు తీవ్రగాయమైంది. అంగవైకల్యం పింఛన్ ఆయనకు ఇస్తున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత మాజీ సైనికుల కోటా కింద భూమి ఇవ్వాలంటూ అక్టోబరు 28, 2020లో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామంలోని సర్వే.నెం.707లో ఐదెకరాల మెట్టభూమిని జీవో.743, 612 ప్రకారం కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నా 2020 సంవత్సరం నుంచి నేటి వరకు జిల్లా రెవెన్యూ అధికారులు సమస్య పరిష్కరించలేదని ఆయన ఆరోపించారు.

కంప్యూటరీకరణ సగమే

5వ పేజీ తరువాయి

సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తయితే.. రాజకీయ నాయకుల అక్రమాలకు తెరపడినట్లే. ఇప్పటి దాకా గ్రామాల్లో సహకార సంఘాల్లో కార్యకలాపాలు నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయి. రైతులకు రుణం కావాలంటే ఖచ్చితంగా వారి చేతులు తడపాల్సిందే. ఇప్పటిదాకా సహకార సంఘాల్లో రుణం కావాలంటే రైతులు తప్పనిసరిగా రాజకీయ నాయకులు సంఘాల్లోని సీఈవోలు సిబ్బంది చేతులు తడపాల్సిన పరిస్థితి నెలకొంది. కంప్యూటరీకరణతో ఈ అక్రమాలకు దాదాపు 90 శాతం చెక్ పడే అవకాశం ఉందని సహకార కేంద్ర బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఎప్పుడో పూర్తి కావాల్సిన ఈ కంప్యూటరీకరణ రాజకీయ నాయకులు మోకాలొడ్డుతుండటం వల్లే పూర్తి కాని పరిస్థితి నెలకొందని వారు చెబుతున్నారు. కర్నూలు, పత్తికొండ, డోన్, బనగానపల్లె, నంద్యాల, నందికొట్కూరు, ఆలూరు, ఆదోని తదితర ప్రాంతాల్లో రాజకీయ నాయకుల ఒత్తిడితో బోగస్ రైతుల పేరు మీద పాసు పుస్తకాలు తయారు చేసి రుణాలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో బినామీ పేర్లతో పెద్ద ఎత్తున రుణాలు తీసుకుని బకాయిలు ఎగవేసిన కారణంగా దాదాపు 40 శాతం సహకార సంఘాలు సంక్షోభ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఎంతో మంది సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోని మేనేజర్లు, సూపర్‌వైజర్లు అదే విధంగా సంఘాల్లోని సీఈవోలు ఉద్యోగాలు పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. ఓర్వకల్లు మండలంలోని నన్నూరులో ఇటీవలె ఆ సంఘంలో పని చేస్తున్న సీఈవో రాజకీయ నాయకుల ఒత్తిడితో ఎరువుల పంపిణీకి సంబంధించి అక్రమాలకు పాల్పడి ప్రస్తుతం ఉద్యోగాన్ని పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఆలూరు సహకార బ్యాంకు పరిధిలో చనిపోయిన ఓ రైతుకు రుణాన్ని మంజూరు చేసి ఉద్యోగం నుంచి తొలగించడం జరిగింది. ఆదోని, క్రిష్ణగిరి, డోన్, కర్నూలులోని కృష్ణానగర్ బ్రాంచ్ పరిధిలో కూడా ఇవే పరిస్థితులు తలెత్తాయి. ఈ దారుణాలకు చెక్‌పెట్టాలంటే కంప్యూటరీకరణ తప్ప మరో మార్గం లేదు. దశాబ్దాల నుంచి నిద్రావస్తను వీడి ఇప్పుడిప్పుడే కంప్యూటరీకరణ చేపట్టిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రస్తుతం ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆపసోపాలు ఎదుర్కొంటోంది.

నాయకుల అక్రమాలు బయటపడుతాయనే...

ఎప్పుడో సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి కావాల్సింది. రాజకీయ నాయకులు తమ అక్రమాలు ఎక్కడ వెలుగు చూస్తాయోనన్న భయంతో కంప్యూటరీకరణను అడ్డుకుంటున్నారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం జరిపేందుకు కంప్యూటీకరణ పనులను వేగవంతం చేసి వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలి.

\- జగన్నాథం,
రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

ఇప్పటిదాకా 50 శాతం మాత్రమే జరిగింది

అక్టోబరు 2వ తేదీ నాటికి ఉమ్మడి జిల్లాలోని 99 సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే పూర్తయింది. ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన సంఘాల్లో కంప్యూటరీకరణ పనులు జరుగుతున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి జిల్లాలోని పసుపుల, సి.బెళగల్, మిడ్తూరు, బేతంచెర్ల మండలాలు ఎంపికయ్యాయి. ఖరీఫ్‌లో పంట రుణాల కోసం రూ.15 కోట్లను కేటాయించాం. అన్ని సహకార సంఘాల్లో రైతుల వివరాలను కంప్యూటరీకరణ పూర్తి చేస్తాం. ఈ ప్రక్రియ పూర్తయితే అర్హులైన రైతులందరికీ సకాలంలో రుణాలు అందుతాయి. రాజకీయ జోక్యం కూడా తగ్గుతుంది. ఎటువంటి అక్రమాలకు తావుండదు. ఈ పంట రుణాలు తప్పనిసరిగా అన్ని సంఘాల్లో పూర్తి చేయాల్సిందేనని ఆదేశాలు కూడా ఇచ్చాము.

\- డీసీసీబీ, సీఈవో విజయకుమార్

'ప్రొ. సాయిబాబా మృతి.. రాజ్యం చేసిన హత్య'


మాట్లాడుతున్న వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్

కర్నూలు కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబా సహజంగా మరణించలేదని, ఆయనను రాజ్యం హత్య చేసిందని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో వేదిక ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా స్మృతిలో బహిరంగ సభ నిర్వహించారు. అంతక ముందు కలెక్టరేట్ నుంచి ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేదిక జిల్లా కన్వీనర్ అల్లాబకాష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల చేతుల్లో కీలుబొమ్మలుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భారత సైన్యం సొంత ప్రజలపైనే యుద్ధం చేస్తోందని ఆరోపించారు. ఆదివాసీ ఉద్యమాలకు ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం కూడగట్టినందుకే ప్రొ. సాయిబాబ మీద ప్రభుత్వం కక్షకట్టి జైలుపాయి చేసిందని అన్నారు. ఆయనకు జైల్లో వైద్యం చేయించకుండా వేధించిందని, బైటికి వచ్చాక ఆయన మరణించే పరిస్థితి ఏర్పడిందని, ఇది రాజ్యం చేసిన హత్య అని అన్నారు. ఆదివాసీల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలను విడనాడాలని, కేంద్రం చేస్తున్న కగార్ యుద్ధాన్ని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘం నాయకుడు పాణి, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జేవీవీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి, రైతుకూలీ సంఘం నాయకుడు సుంకన్న, పీవోడబ్ల్యూ నాయకుడు శ్రీనివాసరావు, మనోహర మాణిక్యం, ఎస్‌డీపీఐ నాయకుడు చాంద్‌బాషా, కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు సుబ్బరాయుడు, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కరరెడ్డి, డీటీఎఫ్ నాయకుడు రత్నం ఏసేపు ప్రసంగించారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్ కుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం మంత్రాలయం వచ్చారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.


ప్రదక్షిణ చేస్తున్న జస్టిస్ సంజీవ్ కుమార్

పోలీసుల అమర వీరులకు వందనం



- అత్మకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):

శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో పోలీసుల పాత్ర కీలకం. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ ప్రజలకు రక్షణ కల్పించడంలో ముందుండేది పోలీసులే. విధి నిర్వహణలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి వారి సేవలను స్మరించుకునేందుకు ప్రతిఏటా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఏడు రోజుల పాటు సాగే ఈ వారోత్సవాలు ప్రతిరోజూ వివిధ కార్యక్రమాల ద్వారా పోలీసు సేవలను ప్రజలకు వివరించడమే కాకుండా సామాజిక స్పృహను ప్రతిబింబించే రీతిలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వర్తించనున్నారు. అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించి విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీసులకు నివాళి అర్పిస్తారు.

- శాంతి భద్రతల పర్యవేక్షణలో వారే కీలకం
- ఒత్తిడితో సతమతమవుతున్న పోలీసులు
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం



ఎప్పుడు పోలీసు అమరవీరుల దినం :

ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. భారత్, చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో గల హాట్ స్ప్రింగ్స్ అనే ప్రదేశంలో 1959 అక్టోబరు 21న చైనా సైనికులు దాడి చేసిన సంఘటనలో పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు నేలకొరిగారు. వారి మృతదేహాలను సొంత ప్రాంతాలకు తరలించలేని పరిస్థితి ఏర్పడి అక్కడే ఖననం చేశారు. అప్పటి నుంచి వారిని స్మరించుకుంటూ ప్రతి యేటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. 11 రోజుల పాటు సాగే పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని నంద్యాల, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, డోన్ పోలీసు సబ్‌డివిజన్లలోని 42 పోలీసుస్టేషన్లలో పోలీసు సేవలపై అవగాహన కార్యక్రమాలు నిర్వర్తించారు.

కత్తిమీద సాములా పోలీసు డ్యూటీ :

పోలీసులు తమ డ్యూటీలు నిర్వహించడం కత్తి మీద సాములా మారుతోంది. సెలవులు లభించక నిత్యం ఒత్తిళ్లతో విధులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం వారాంతపు సెలవు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. పోలీసు శాఖలో ఎన్నో ఏళ్లుగా సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఆ దిశగా పాలక ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా చేయాల్సిన డ్యూటీలను పక్కన బెట్టి అవసరం లేకున్నా కూడా రాజకీయ నాయకుల సభలు, సమావేశాలు, ఇతరత్రా అవసరాలకు పోలీసులను బందోబస్తుగా వాడుకుంటున్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. ఇదిలాఉంటే పోలీసు శాఖ నుంచి సరైన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో స్టేషన్ ఖర్చుల కోసం ఫిర్యాదిదారుల వద్ద చేయి చాచాల్సిన దుస్థితి నెలకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలావుంటే ఇటీవల కాలంలో పోలీసు అధికారుల బదిలీల్లో కూడా రాజకీయ జోక్యం అధికమవడంతో నిక్కచ్చిగా పనిచేసే పోలీసు అధికారులు సైతం రాజకీయ నాయకుల చేతుల్లో కీలు బొమ్మల్లా మార్చాల్సిన దుస్థితి దాపురించింది. అయితే విధి నిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాలకు తగిన సహాయం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయంటూ అమరవీరుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



పోలీసు అమరవీరుల త్యాగనిరతి చిరస్మరణీయం

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీసు అమరవీరుల త్యాగనిరతి చిరస్మరణీయం. వారి ఆశయ సాధనకు మేమందరం కృషిచేస్తాం. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహించి పోలీసు సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. కాగా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములైనప్పుడే పోలీసు వ్యవస్థ మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంది. అలాగే పోలీసు అమరవీరుల స్ఫూర్తితో శాంతిభద్రతల పర్యవేక్షణకు ఎలాంటి విఘాతం తలెత్తకుండా ప్రజలకు రక్షణగా నిలిచి పోలీసుశాఖ మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నాం.

- ఆర్.రామాంజీనాయక్, ఆత్మకూరు డీఎస్పీ

ముగ్గురు అంతర్రాష్ట్ర బైకు దొంగల అరెస్టు

11 బైకుల స్వాధీనం

కోవెలకుంట్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర మోటారు బైకు దొంగలు ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.10 లక్షలు విలువ చేసే 11 మోటారు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ తెలిపారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ, సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో విలేకరులకు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నంద్యాల, కడప జిల్లాల్లో పలుచోట్ల బైకు దొంగతనాలు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగు పట్టణం భాగ్యనగర్‌కు చెందిన హుసేన్‌వలి, ప్రొద్దుటూరుకు చెందిన షేక్ ఫజిల్‌బాషా, మైదుకూరుకు చెందిన వాదనపల్లి అమీర్‌బాషా గత కొంతకాలంగా నంద్యాల, కడప జిల్లాల్లో 11 బైకులు దొంగతనం చేసి, వాటి ఛాసిస్, ఇంజన్లను మార్చి మరో వ్యక్తి పేరుతో రికార్డులు సృష్టించి కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాల్లో విక్రయించారని తెలిపారు. కోవెలకుంట్లలో రెండు బైకులు దొంగిలించే సమయంలో సీసీ కెమెరాకు చిక్కారని అన్నారు. ఈ దొంగతనాలపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కావడంతో విచారణ చేపట్టారమని అన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి బైకులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించారు. బైకు దొంగతనం కేసు ఛేదించిన సీఐ హనుమంతనాయక్‌ను, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



పట్టుబడిన మోటరు బైకుల దొంగతనాల నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

పెద్దహోతూరు రోడ్డులో ఇరుక్కున్న లారీ

- రాకపోకలకు అంతరాయం



ఆలూరు, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : పెద్ద హోతూరు రోడ్డులో లారీ ఇరుక్కొని రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలకు ప్రధాన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ఆలూరు-కర్నూలు వెళ్లే ప్రధాన రహదారి పెద్ద హోతూరు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున బళ్లారి వైపు వెళ్తున్న లారీ ఇరుక్కుపోయింది. మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు అధ్వాన స్థితికి చేరుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ.. ముగ్గురికి గాయాలు

నందికొట్కూరు రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు సమీపంలో గల భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో కేజీ రహదారిపై ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును డోన్ నుంచి నందికొట్కూరు వైపుగా వెళ్తున్న లారీ ఢీకొంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రదీప్, కండక్టర్ సరస్వతి, ప్రయాణికుడు రామచంద్రులకు తీవ్ర గాయాలు కావడంతో బ్రాహ్మణకొట్కూరు పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ వడ్డె మద్దిలేటిని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్సై తిరుపాలు తెలిపారు.

కర్ణాటక బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మంత్రాలయం అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కురువ వీరేష్ (38) కర్ణాటక బస్సు ఢీకొని మృతి చెందాడు. ఈ రోడ్డు ప్రమాదం ఆదివారం సాయంత్రం కర్నాటక ప్రాంతంలో జరిగింది. తుంగభద్ర నది బ్రిడ్జి పక్కన ఉన్న స్వగ్రామం మాధవరానికి వీరేష్ వస్తుండగా... మాధవరం నుంచి రాయచూరు వెళ్లే కర్ణాటక బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటకలోని ఇడపనూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృతదేహాన్ని రాయచూరు ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య రామలక్ష్మి, ఇద్దరు కొడుకులు వీరేంద్ర, మల్లేష్ కర్నాటక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన బోయ బోడ బండ వీరేష్ (41) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వీరేష్ రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం తన పొలంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆదోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

రామాపురంలో..

అవుకు: రామాపురం గ్రామానికి చెందిన వడ్డె మహేష్ (32) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ వడ్డె మహేష్ గ్రా మంలో హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తాగుడుకు అలవాడు పడి జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఘటనా స్థ లానికి చేరకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య రాజ్యల క్ష్మీ, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

విద్యార్థులపై ప్రొఫెసర్ బూతు పురాణం

కర్నూలు, అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో వసతి గృహం వద్ద ఓ ప్రొఫెసర్ విద్యార్థులపై విరుచుకుపడ్డారు. అడ్డు వచ్చిన వారిపై బూతులు తిట్టి భయభ్రాంతులకు గురి చేశారు. ఆదివారం ఉదయాన్నే వసతి గృహంలో పర్యవేక్షణకు వచ్చిన ప్రొఫెసర్ క్యాంపస్‌లో జరిగే పరిణామాలు బయటకు పొక్కితే తీవ్ర పరిణామాలు ఉంటాయని విద్యార్థులను హెచ్చరించారు. దీంతో ఇదే విషయాన్ని వర్సిటీ ఉన్నతాధికారులకు తెలియజేశామని విద్యార్థులు తెలిపారు. విచారించి సమస్య లేకుండా చూసుకుంటామని రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బోయ విజయకుమార్ నాయుడు తెలిపారు.

ఫార్మసిస్టులకు పదోన్నతులు కల్పించాలి

- ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి



కర్నూలు హస్పిటల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జోనల్‌లో ఫార్మసిస్టులకు జరిగే పదోన్నతులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీ ఓల్డ్ సీఎల్‌జీలో ఫార్మసీ ఆఫీసర్ల అసోసియేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంగళ్‌రెడ్డి ఇటీవల కాంట్రాక్టు నుంచి రెగ్యులర్ అయిన 12 మంది ఫార్మసీ ఆఫీసర్లను సన్మానించారు. అనంతరం డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ మాట్లాడుతూ ఫార్మసీ ఆఫీసర్ల పదోన్నతుల జాబితాను సిద్ధం చేసి కడప ఆర్డీకి పంపనున్నట్లు తెలిపారు. ఫార్మసీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగస్వామి, రాజేష్ కుమార్, రాష్ట్ర నాయకులు వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఫేక్ ఫోన్ పేతో మోసం

కర్నూలు క్రైం, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి): ఏటీఎంల దగ్గర ఫేక్ ఫోన్ పేలతో మోసం చేస్తున్న కార్తిక్ అనే యువకున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బి.తాండ్రపాడుకు చెందిన కార్తిక్ ఉయ్యాలవాడలో పోస్టుమెన్‌గా పని చేస్తున్నాడు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌బీఐ సర్కిల్‌లో ఏటీఎంల వద్ద ఉండి నగదు డిపాజిట్ చేసే వ్యక్తులను గుర్తుంచుకుంటూ ఉంటాడు. తనకు నగదు ఇవ్వండి.. ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేస్తానని నమ్మించి ఫేక్ ఫోన్ పే ద్వారా నగదు జమ చేస్తాడు. నగదు జమ అయినట్లు మేసేస్ రావడంతో బాధితులు నగదు ఇచ్చి వెళ్లిపోతారు. ఇలా రూ.1.50 లక్షల నగదు మోసం చేసినట్లు గుర్తించి పోలీసులు కార్తిన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మహిళ హత్య కేసులో నిందితుల రిమాండ్

నందికొట్కూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శిరీష హత్య కేసులో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నాగటూరుకు చెందిన శిరీష హత్య కేసులో ఆమె సోదరుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నందికొట్కూరు శివారులోని ఉర్దూ మదరసా సమీపంలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. మృతురాలు శిరీష మామ గొల్ల కురుమన్న, ఆయన భార్య మహేశ్వరి, కుమారుడు నరసింహులును అరెస్టు చేసి కోర్టు హాజరు పరిచారు. అత్తింటి కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని పుట్టింటిలో తరచూ ఫిర్యాదు చేస్తోందన్న కక్షతో మామ కురుమన్న హత్య చేసినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ఎనిమిది నెలల శిశువును అనాథను చేసిన తల్లి



పావని (ఫైల్)



చిన్నారి కావ్య



పావని మృతితో రోదిస్తున్న బంధువులు

ఆదోని, అక్టోబరు 20,(ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలోని అమరావతినగర్ కాలనీకి చెందిన పావని (22) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన రంగన్న, నాగమ్మల కుమార్తె పావనికి మూడేళ్ల క్రితం అమరావతి నగర్ కాలనీ చెందిన శ్రీనుతో వివాహమైంది. ఆయన మున్సిపల్‌లో లైన్‌మెగా పనిచేస్తున్నాడు. వివాహ సమయంలో కట్నకానుకలు కూడా ఇచ్చారు. వీరికి 8 నెలలు కూతురు కావ్య ఉంది. దసరా పండుగకు పావనిని తల్లిదండ్రులు పుట్టింటికి పిలుచుకు వెళ్లారు. శ్రీను మాత్రం అత్తమామ ఇంటికి వెళ్లలేదు. ఇటీవల భార్యపై అనుమానం పెంచుకున్నాడు. పండుగ వెళ్లిపోయాక పావని ఇంటికి పిలుచుకు వెళ్లేందుకు భర్త రాకపోవడంతో కుటుంబ సభ్యులే పావనిని పిలుచుకొని వెళ్లి భర్త ఇంట్లో వదిలేసి వెళ్లిరు. భర్త వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన పావని ఉరేసుకుంది. అయితే అల్లుడే తమ కూతుర్ని హత్య చేశాడని పావని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి తరలించారు. తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరామ్ తెలిపారు.

ఆగిన తల్లి గుండె

- రెండేళ్ల క్రితమే గుండెపోటుతో తండ్రి మృతి
- తల్లి మృతితో అనాథలైన పిల్లలు



లక్ష్మి (ఫైల్)



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న చిన్నారులు

పత్తికొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆగిన తల్లి గుండెతో ఆ చిన్నారులు అనాథలయ్యారు. రెండేళ్ల క్రితం తండ్రిపోయిన తల్లి నీడన పెరిగారు. ఆమె కూడా మృతి చెందడంతో దిక్కులేని వారయ్యారు. పత్తికొండ మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన మద్దిలేటి, రంగమ్మలకు లక్ష్మి, మధులు సంతానం. తుగ్గలి మండలం మారెళ్లకు చెందిన దుప్పటి అంజికి లక్ష్మిని 15 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి జయశ్రీ, అంకిత, ఉషశ్రీ కూతుళ్లు సంతానం. రెండేళ్ల క్రితం తండ్రి అంజి మృతి చెందాడు. మెట్టినింట్లో ఎవరూ ఆదరించే పరిస్థితి లేకపోవడంతో ముగ్గురు ఆడ కూతుళ్లను తీసుకుని లక్ష్మి పుట్టినిల్లయిన చందోలికి చేరుకుంది. తల్లి వద్ద ఉంటూ కూలి పనులు చేస్తూ పిల్లలను పోషించుకుంటోంది. స్థానిక పాఠశాలలో పిల్లలు చదువుకుంటున్నారు. లక్ష్మి ఆదివారం గుండెపోటుతో మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలుగా మిగిలారు. అమ్మమ్మ ఉన్నా ఆమె వీరిని పోషించే పరిస్థితి లేదు. ఇదేమీ తెలియని చిన్నారులు మృతి చెందిన తల్లి మృతదేహం వద్ద కూర్చొని ఏడుస్తున్న దృశ్యం పలువురిని కంటతడి పెట్టించింది. వీరిలో ఐదేళ్లు ఉన్న కూతురు ఉషశ్రీ అమ్మా.. లే అమ్మ అంటూ పిలవడం పలువురి హృదయాలను కలిచివేసింది. ప్రభుత్వం చిన్నారులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే రూ. కోట్ల స్థలం కబ్జా

- వైసీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ నాయకుడు చంద్రకాంత్ రెడ్డి

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 20,(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రోద్బలంతోనే ఆయన అనుచరుడు డాక్టర్ రవి కిరణ్ రూ.1.80కోట్ల స్థలాన్ని ఫోర్జరీ సంతకాలతో కబ్జా చేశాడని వైసీపీ పట్టణ గౌరవ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి నివాసంలో ఆయన మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడైన డాక్టర్ రవి కిరణ్ రూ. కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసుకోవడం వెనుక డాక్టర్ పార్థసారథి ప్రమేయం ఉందని ఆరోపించారు. ఎస్‌కేడీ కాలనీలో కురువ హనుమంతమ్మ చెందిన కోట్ల విలువైన స్థలాన్ని నకిలీ ఆధార్ ద్వారా, ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, కామాక్షి తిమ్మప్ప పాల్గొన్నారు.

ఆత్మకూరులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఆత్మకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని ఆర్డీటీ కాలనీ సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దుద్యాలకు వెళ్లే రస్తా నుంచి వంద మీటర్ల దూరంలో చెట్ల పొదల్లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ హుసేన్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే మృతుని ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఆయన మృతదేహాన్ని ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రంలోని పోస్టుమార్టం గదికి తరలించారు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగి ఉండి, ఐదు అడుగుల ఎత్తు, గడ్డంతో పాటు నలుపు తెలుపుతో కూడిన నీలపు రంగు గళ్ల చొక్కా, నలుపు రంగు పాయింట్ వేసుకున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121101182, 8328689639 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో ఆదివారం ఓ బాలిక ఆత్మహత్యాయత్నం చేసింది. గ్రామానికి చెందిన బాలిక వ్యక్తిగత సమస్యలతో మనస్తాపంతో ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- తెలంగాణలో ఘటన

దేవరుప్పుల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా జనగామ-సూర్యాపేట రాష్ట్ర రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందాడు. దేవరుప్పుల ఎస్ సృజన్‌కుమార్ కథనం ప్రకారం. కర్నూల్ జిల్లా ముగతికి చెందిన బోయ నర్సింహ(20), వనపర్తి జిల్లా మాదాపురానికి చెందిన చీరోలు భరత్(22) కలిసి కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ప్లంబింగ్ పనికోసం వెళ్లారు. పని మీద బైక్‌పై జనగామ-సూర్యాపేట రహదారిపై దేవరుప్పులకు బయలుదేరారు. గొల్లపల్లి బస్‌స్టేజీ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించారు. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టి, ఆర్టీసీ బస్సుకు తగిలారు. దాంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన నర్సింహ, భరత్ కిందపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఆటోలు ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వకాలు జరపడం లేదు

దేవనకొండ ,అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కప్పట్రాళ్ల ఫారెస్టులో ఎటువంటి తవ్వకాలు జరగడం లేదని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్.రామచంద్రుడు అన్నారు. ఆదివారం సాయంత్రం గ్రామంలోని ప్రజలతో మాట్లాడారు. ప్రస్తుతం రిజర్వ్‌ఫారెస్టులో యురేనియం తవ్వకాలపై జరుగుతున్న ప్రచారంపై ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రజలకు అవగాహన అవగాహన కల్పించారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ ,సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం కల్పించండి

డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ



మాట్లాడుతున్న మురళీకృష్ణ

కర్నూలు, అర్బన్, అక్టోబరు 19,(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ అన్నారు. ఆదివారం సిటీ అధ్యక్షుడు షేక్ జిలానీ ఆధ్వర్యంలో పోస్టు కార్డులపై సంతకాలు చేసి సీఎం, చంద్రబాబుకు పంపారు. కొత్త బస్టాండ్ నుంచి బస్సు ప్రయాణం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా మహిళలకు బస్సు ప్రయాణం ఎందుకు కల్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతి రోజూ 20 లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారని, రోజు మహిళల ద్వారా రూ.7.10 కోట్లు, నెలకు రూ.300 కోట్లు ఆదాయం వస్తోందని దాటవేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో ఉచిత బస్సు ప్రయాణం, కీలకమైందని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఎ.వెంకట సుజాత, షేక్ ఖాజా హుస్సేన్, కరుణమ్మ, అబ్దుల్ హై పాల్గొన్నారు.

పల్లె పండుగతో ప్రగతి: ఎమ్మెల్యే

ఆత్మకూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాలు పల్లె ప్రగతికి జీవం పోశాయని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలం వెంకటాపురంలో రూ.45.50 లక్షలు, శ్రీపతిరావుపేటలో రూ.20 లక్షలు, కురుకుందలో రూ.40 వేలు, వడ్లరామాపురంలో రూ.35 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే బుడ్డా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో రూ.20 కోట్లతో అంతర్గత రహదారులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు వెంకటాపురంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీశైల దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచ్ మహానంది గంగాదేవీ, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, రాజారెడ్డి, మల్లెఎలీషా, తిరుపమయ్య, నబిరసూల్, వెంకటరావు, బాబు, పుల్లారెడ్డి పాల్గొన్నారు.


వడ్లరామాపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మహానంది: మహానంది మండలం మసీదుపురానికి చెందిన ఐదుగురు టీడీపీ కార్యకర్తలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. రూ.71,500 మంజూరైనట్లు మండల టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నరాల చంద్ర మౌళీశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా సంపంగి శివయ్య, ఈశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రేణుక, శివరామ లక్ష్మమ్మలకు చెక్కులు ఇచ్చారు.

మహానందిలో చీఫ్ ఫైనాన్స్ అధికారి పూజలు

మహానంది, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఉపాధి హామీ పథకం చీఫ్ ఫైనాన్స్ అధికారి పార్వతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వీరికి ఆలయ ముఖద్వారం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌ఎస్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వయంభు లింగంకు, కామేశ్వరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు చేశారు. కల్యాణ మండపంలో వీరిని ఆలయ వేదపండితులు హనుమంత్ శర్మ శాల్వతో సన్మానించి, స్వామి వారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు.

సంఘ విద్రోహుల ఆట కట్టించేందుకే కార్డన్ సెర్చ్ : ఎస్పీ

నంద్యాల క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సంఘ విద్రోహుల ఆటకట్టించేందుకు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏక కాలంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. నేర నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లాలోని డోన్ పట్టణం, ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్‌లోని చాగలమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొడిగనూరు, కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపల్లె, నందికొట్కూరు రూరల్ సర్కిల్ పరిధిలోని ముచ్చుమర్రి తదితర ప్రాంతాల్లో ఆదివారం కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దు

గడివేముల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పొదుపులక్ష్మి సంఘం కార్యాలయ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వద్దని పొదుపు మహిళా మండల సమాఖ్య సంఘం అధ్యక్షురాలు ఎల్లమ్మ, సెక్రటరీ లలిత ఎక్సైజ్ ఎస్‌ఐ బ్రహ్మంకు, గడివేముల పోలీసు స్టేషన్‌లో ఆదివారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పొదుపులక్ష్మి సంఘం కార్యాలయ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. మద్యం దుకాణ యజమానులు పొదుపులక్ష్మి కార్యాలయ సమీపంలో మద్యం షాపు ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మద్యం దుకాణాన్ని కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేస్తే మద్యం బాబుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని, అనుమతి ఇవ్వ వద్దని ఎస్‌ఐని కోరారు.


ఎక్సైజ్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న పొదుపు మహిళలు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ఆత్మకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని శ్రీపద్మావతి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పి.ఆశ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18న కర్నూలులోని డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన బాలుర, బాలికల ఖోఖో రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీల్లో తమ పాఠశాల తరఫున పాల్గొన్న 9వ తరగతి చదువుతున్న ఎస్.చందన, గాయత్రీ, దినేశ్వరసింగ్ అనే విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరిగే ఖోఖో రాష్ట్ర స్థాయి క్రీడలకు తమ పాఠశాల విద్యార్థులు హాజరవుతారని వివరించారు.

చదరంగం పోటీలు ప్రారంభం

నంద్యాల రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని క్రాంతినగర్ శ్రీశాంతినికేతన్ స్కూల్‌లో నంద్యాల జిల్లా ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాలకు సంబంధించి చదరంగం జట్ల ఎంపిక పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఎంపికైన జట్లు పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటాయని జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు.

ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

నంద్యాల రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించనున్న 68వ రాష్ట్ర స్థాయి అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ క్రీడలు పట్టణంలోని పద్మావతి నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు మంచి గుర్తింపు ఇస్తుందన్నారు. నంద్యాల పట్టణంలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని, క్రీడాకారులకు వసతులు సమకూర్చుతానని హామీ యిచ్చారు. 13 జిల్లాల నుండి 350 మంది క్రీడాకారులు నంద్యాలకు రావడం సంతోషంగా ఉందని, రాష్ట్ర స్థాయి పోటీలకు నంద్యాల ఆతిథ్యం వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి క్రీడల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిధిలోని ఎంఈవోలు, జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి గిడ్డయ్య, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, జిల్లా ఫెన్సింగ్ కోచ్‌లు మహేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎన్‌ఎండీ ఫిరోజ్

యోగా సెంటర్‌పై రాజకీయం చేయవద్దు

పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలోని పార్క్‌లో నిర్వహిస్తున్న యోగా సెంటర్‌ను రాజకీయం చేయవద్దని నంద్యాల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ యోగా సెంటర్‌ను కూల్చి వేయనున్నట్లు కొద్ది రోజులుగా కొందరు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వార్తలను నమ్మవద్దని కోరారు. యోగా సెంటర్ విషయాన్ని రాజకీయంగా వాడుకోవాలని కొందరు పన్నాగం పన్నుతున్నారని తెలిపారు. మంత్రి ఫరూక్ నంద్యాలకు వచ్చిన వెంటనే యోగా సెంటర్‌పై చర్చించనున్నట్లు తెలిపారు.

యోగా సెంటర్‌ను తొలగించాలనడం సరికాదు

పట్టణంలోని మున్సిపల్ పార్కులోని యోగా సెంటర్‌ను మున్సిపల్ అధికారులు తొలగించాలనడం సరికాదని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన యోగా సెంటర్‌ను పరిశీలించారు. యోగా సెంటర్‌ను తొలగించే ముందు మున్సిపల్ స్థలాలు, రహదారులు ఆక్రమణను గుర్తించాలని అన్నారు.

గ్రామాభివృద్ధితోనే దేశ పురోగతి: ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితోనే దేశం పురోగతి సాధిస్తుని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ఆదివారం నందికొట్కూరు మండలంలోని మల్యాల గ్రామం, శాతనకోట గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. మల్యాల, శాతన కోట గ్రామాల్లో సీసీ రోడ్లకు శాస్త్రోక్తంగా భూమి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, ఎంపీడీవో సుబ్రమణ్యశర్మ, ఏపీఓ అలివేలు మంగమ్మ, పీఎస్(పీఏ) రవీంద్రబాబు, శాతనకోట వీఆర్వో ఆనంద్, మల్యాల సర్పంచ్ ఉమాదేవి, శాతన కోట సర్పంచ్ జనార్దనగౌడు, తిమ్మారెడ్డి, వెంకటరెడ్డి, శంకర్‌గౌడ్, జక్కుల స్వాములు, చింతకుంట నారాయణ పాల్గొన్నారు.

పాములపాడు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ఆదివారం మండలంలోని క్రిష్ణరావుపేటలో టీడీపీ నాయకులు జనార్దన్, సన్ని, రామక్రిష్ణ, తుమ్మలూరు గ్రామంలో జ్యోతిరామలింగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొన్నారు. నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాద్‌రెడ్డి, తిమ్మారెడ్డి, మధుక్రిష్ణ, చంద్రశేఖర్, గోవిందు, సత్యంరెడ్డి, శివరామయ్య, పూసలక్రిష్ణ, హఫీజ్, ఎసేపు అలీసాహెబ్, ఇబ్రహీం, మౌలాలి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల కేంద్రంలోని టీడీపీ కార్యకర్త పగడం రవి అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య నివాళ్లు అర్పించారు. మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త పగడం వెంకటశివుడు కుమారుడు రవి కిడ్నీ సమస్యతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య రవి మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

కొత్తపలి: కొత్తపల్లిలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన టీడీపీ యువ కార్యకర్త గూడెం స్వాములు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య భరోసా ఇచ్చారు. ఆదివారం సాయంత్రం కొత్తపల్లికి వెళ్లి గూడెం స్వాములు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చులకు ఎమ్మెల్యే రూ.15వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి, బీసీ సంఘం నాయకులు నాగేశ్వరరావు యాదవ్, నడిపెన్న, బ్రహ్మరెడ్డి, వెంకట్రాముడు, తదితరులు ఉన్నారు.


శాతనకోటలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

తరగతులను అడ్డుకున్న విద్యార్థి నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నందికొట్కూరు పట్టణంలో పలు ప్రైవేటు పాఠశాలలు నిర్వహిస్తున్న తరగతులను ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏవీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఆదివారం కూడా ప్రైవేటు పాఠశాలలు తరగతులను నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇలా నిర్వహించడం విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కడమేనని అన్నారు. తరగతులను అడ్డుకున్న వారిలో ఏవీఎస్ నాయకులు మహేష్, ఉదయ్, అభి తదితరులు ఉన్నారు.

ముగిసిన పల్లె పండుగ వారోత్సవాలు

గోస్పాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కోసం చేపట్టిన పల్లెపండుగ వారోత్సవాలు ముగిశాయి. ఆదివారం జూలేపల్లె, చింతకుంట్ల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగ అనసూయ, ఏపీవో జ్యోతి, టీడీపీ నాయకులు ఓబుల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుదర్శన్ రెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ఆత్మకూరురూరల్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వ్యవసాయ కూలీలకు పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసి వ్యవసాయ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, పట్టణ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర కోరారు. ఆదివారం పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన మహా సభ సందర్భంగా ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీసీఎం నాయకులు షేక్ ఇస్మాయిల్, శివుడు, గణపతి, రాముడు, శిలార్, కలిముల్లా, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్లమెంట్ క్రియాశీలక సభ్యత్వ కార్యశాల

నంద్యాల కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో సోమవారం ఉదయం 10.30 గంటలకు నంద్యాల బీజేపీ కార్యాలయంలో పార్లమెంట్ క్రియాశీలక సభ్యత్వ కార్యశాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు తెలిపారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షులు, మండల క్రియాశీలక సభ్యత్వ సహయోగి, సహయోగి సభ్యులు హాజరు కావాలని నంద్యాల బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి కోరారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాలోత్సవాలు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయటం కోసమే బాలోత్సవాలు జరుగుతున్నట్లు సీనియర్ న్యాయవాది శంకరయ్య అన్నారు. ఆదివారం నంది బాలోత్సవాల నిర్వహణ ఆహ్వాన సంఘం సమావేశం రామక్రిష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రామరాజు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం

ఆత్మకూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం జరుగుతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు అన్నారు. ఆత్మకూరులోని బీసీ సంఘం కార్యాలయంలో ఆదివారం జాతీయ బీసీ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటుపై మంత్రులు చర్చించడం అభినందించ దగ్గ విషయమన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటస్వామిగౌడ్, బాలస్వామి యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో భక్తులు నమో.. నారసింహా అంటూ స్వామి వారి పవిత్రోత్సవాల్లో పాల్గొంటున్నారు. దిగువ అహోబిలంలో నాలుగు రోజులుగా స్వామి వారికి పవిత్రోత్సవాలు జరుగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో కొలువుదీరారు. హోమం, పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థప్రసా దగోష్ఠి తదితర క్రతువులను వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ పాల్గొన్నారు.

సీతారాములకు విశేష పూజలు


కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయం, చాగలమ్మ, గంగమ్మ ఆలయాల్లో ఆది వారం మహిళలు విశేష పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో సీతారాములకు, అమ్మవారికి సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. విష్ణు పారాయణం చేశారు. సీతారాముల ఉత్సవమూర్తులతో పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మ హిళలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

డోన్ రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని దొరప ల్లె గ్రామంలో సీపీఐ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళనలు చేస్తామ ని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, అనుబంధ సంఘాల నాయకులు ప్రభాకర్, వరదరాజులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి


తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

చాగలమర్రి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షంతో భారీగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవా లని పెద్ద బోదనం, చిన్నబోదనం, చాగలమర్రి, గొడిగనూరు, శెట్టివీ డు, చక్రవర్తుల పల్లె తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆదివా రం కోరారు. ఆయా గ్రా మాల సమీపంలోని సర్వీసు రహదారుల్లో మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. పంట చేతికొచ్చి నూర్పిడి చేసి ఆరబెట్టుకుంటున్న తరు ణంలో వర్షానికి మొక్కజొన్న తడిచి నష్టం వాటిల్లిందని రైతులు, కౌలు రైతులు విలపించారు. తడిచిన ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేయర ని, వారు అడిగిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోందని వాపోయారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వవిద్యార్థులు

చాగలమర్రి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1997-98 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కర్నూలు, కడప, అనంతపురం, హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో స్థిరపడిన 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, హెచ్‌ఎం నళిని, భరత్ భూషన్, సంగీతరాణి, శాంత కుమారి, డేవిడ్, దివాకర్, జ్ఞానమణి, లారెన్స్, చంద్రకళ, మహానందప్పలను సన్మానించారు. అనంతరం దివంగత ఉపాధ్యాయులకు నివాళులర్పించారు.

మూడురాళ్లపల్లెలో ఎగిసి పడుతున్న నీరు


మూడురాళ్లలపల్లెలో పాఠశాల వద్ద బోరు నుంచి ఎగిసి పడుతున్న నీరు

చాగలమర్రి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం బోరు నుంచి నీరు ఎగిసి పడింది. మూడు రోజులుగా భారీ వర్షాలు పడుతుండటంతో భూగర్భజలాలు పెరగడంతో బోరుబావుల్లో నీటి ఊటలు పెరిగాయి. దీంతో కదిరిపురం గ్రామానికి పాఠశాల వద్దగల బోరు నుంచి నీరు ఉబికి రావడంతో ప్రజలు, రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బోరు నుంచి నీరు ఎగిసిపడి పాఠశాల ముందు భాగమంతా కుంటగా మారింది.

నీటికుంటలా ప్రధాన రహదారి

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- మరమ్మతుల చేపట్టని అధికారులు

బేతంచెర్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుసిన వర్షాలకు బేతంచెర్ల పట్టణ శివారులోని కర్నూలు-బేతంచెర్ల క్రాస్ రోడ్డు నీటి కుంటలా మారింది. దాంతో వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. ఏడాది కాకముందే కర్నూలు ప్రధాన రహదారి నీటికుంటల్లా మారిందని, ఎదురుగా వచ్చే వాహన దా రులు అవస్థ పడు తున్నారని పలువు రు ద్విచక్ర వాహనదారులు వాపో తున్నారు. రోడ్డుపై ఉన్న తారు లేచి పోయి గుంతలు పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాంట్రాక్టరు నాసిరకంగా రోడ్డు వేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారులే ఇలా నీటి కుంటలా ఉంటే మిగతా రోడ్లు ఎలా ఉంటాయో చెప్పనవసరం లేదని పలువురు వాహనదారులు ఎద్దేవా చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ ఉన్నతాదికారులు ప్రధాన రహదారులపై వర్షం నీరు నిల్వ కుండా మరమ్మతులు కాంట్రాక్టరు చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.


దెబ్బతిన్న రోడ్డు


రహదారులపై నిలిచిన వర్షం నీరు

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

చాగలమర్రి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు అన్నారు. ఆదివారం మండలంలోని సమస్యాత్మక గ్రామమైన గొడిగనూరు గ్రామంలో ఆదివారం తెల్ల వారుజామున పోలీసు బలగాలతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని వివిధ రాజకీ య నాయకులు, రౌడీషీటర్లు, అనుమానితుల, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుత జీవనం కో సం పాటుపడాలని అన్నారు. ప్రజా సంక్షేమం, రక్షణ కోసమే పోలీసులు కృషి చేస్తారని అన్నారు. సరైన ధృవపత్రాలు లేని 36 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని అన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పట్టణ సీఐ చి రంజీవి, శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్‌ఐలు రమేష్‌రెడ్డి, హరిప్రసాదు, నగిన, రామాంజనేయులురెడ్డి, వరప్ర సాద్, చిన్నపీరయ్య, వెంకటేష్, పోలీసులు, హోం గార్డులు పాల్గొన్నారు.


గొడిగనూరులో మాట్లాడుతున్న సీఐ కంబగిరి రాముడు

డోన్ రూరల్ : పట్టణంలోని కొండపేట, పాతపేటలో ప్రాంతాల్లో పోలీసు అధికారులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్‌బాబు, పట్టణ ఎస్‌ఐలు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత ప్రాంతాలలో, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది, క్యూఆర్టీ టీం పాల్గొన్నారు.


కొండపేటలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు: సీఐ

బేతంచెర్ల అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రౌడీషీటర్లు ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించి అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు ప్రజలను భయభ్రాంతు లకు గురి చేసినా, ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్య లు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.


బేతంచెర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

కొలిమిగుండ్ల: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు చేపడతామని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో కార్డెన్‌సర్చ్ కార్యక్రమాన్ని సీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని నాయకుల ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. గొడవలకు దూరంగా ఉండాలని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని సీఐ రమేష్‌బాబు గ్రామస్థులను హెచ్చరించారు. స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ప్యాపిలి: ఘర్షణలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ మధుసూదన్ సూచించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ప్యాపిలి, పోతుదొడ్డి, పెద్దపూదిళ్ల గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన అవాంఛయ సంఘటనలను మరచి ప్రశాంతంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవలు జరిగిన పోలీసుల దృష్టికి తీసుకరావాలని ఎస్‌ఐ సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి'

డోన్ రూరల్ అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ విధి విధానాల వల్ల 11వ పీఆర్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం యూటీఎఫ్ ప్యాపిలి మండలం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

39 సాగునీటి సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం

రుద్రవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలంలో 39 సాగునీటి సంఘాల ఎన్నికలకుఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నట్లు ఆదివారం తహసీల్దరు మల్లికార్జునరావు తెలిపారు. చెరువుల కింద 16, తెలుగుగంగ ప్రధానకాల్వ, బ్లాక్ చానెళ్ల కింద 13 సాగునీటి సంఘాలు ఉన్నాయన్నారు. వీటికి ఓటర్ల జాబితా సిద్ధం చేసుకున్నట్లుతెలిపారు. సాగునీటి సంగఆలకు నవంబరు 21, 22 తేదీల్లో ఎన్నికలు జరగవచ్చన్నారు. ఎన్నికల షెడ్యూలు సోమవారం వెలువడే అవకాశం ఉందని తహసీల్దారు తెలిపారు.

రేపటి నుంచి ఆధార్ వారోత్సవాలు

ఉయ్యాలవాడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా సచివాలయల్లో ఈ నెల 22నుంచి 25 వరకు ఆధార్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉమ మహేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న తుడుమలదిన్నె గ్రామంలో, 23, 24, 25వ తేదీల్లో మాయలూరు గ్రామ సచివాలయంలో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపులు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పనిచేస్తాయన్నారు. ప్రత్యేక ఆధార్ క్యాంపుల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు.

చాగలమర్రి: మండలంలో 22 నుంచి 25వరకు ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో మంజులవాణి ఆదివారం తెలిపారు. ఈ నెల 22న చా గలమర్రి 2, 5 సచివాలయాలు, శెట్టివీడు, గొడిగనూరు, 23న మల్లేవేముల, మద్దూరు, ముత్యాలపాడు, డి.వనిపెంట, 24న పెద్దబోదనం, చాగలమర్రి-1, చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాల్లో, 25న నేలంపాడు, చాగలమర్రి-3, 4, చింతల చెరువు సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో అన్నారు.

హెల్మెట్ ధరించాలి

సంజామల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎస్.ఐ రమణయ్య హెచ్చ రించారు. ఆదివారం ముదిగేడు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేశారు. లైసెన్సులు, ఆర్.సి, యూనిఫాం, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న పలు వాహనాలను ఆపి ఆపరాధ రుసుము విధించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపడం నేరం అన్నారు. ప్రతి వాహనదారుడు తప్పని సరిగా పత్రాలు కలిగి ఉండాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌డీఏ పాలనలోనే గ్రామాభివృద్ధి: టీడీపీ

బనగానపల్లె , అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బనగానపల్లె పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్ అన్నారు. బనగానపల్లె మండలంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. బనగానపల్లె పట్టణంలోని విద్యుత్ కార్యాలయం సమీపంలోని జమ్మిరెడ్డి కాలనీ, పట్టణంలోని బంగారమ్మ గుడి సమీపంలోని తెలుగుపేటలో రూ. 70 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు టీడీపీ నాయకులు, అధికారులు భూమిపూజ చేశారు. కైప గ్రామంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఈవోఆర్డీ సతీశ్‌కుమార్‌రెడ్డి, ఏఈ వెంకటరమణ, ఎంపీటీసీ కిట్టన్న, వార్డు సభ్యులు నాగేంద్రా రెడ్డి, అరుణ, జక్కు రామాంజి, సురేశ్, శ్రీను,సుబ్బన్న, సుబ్ర హ్మణ్యం, ఏపీవో రేష్మా పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలో పలు వీధుల్లో సీసీ రోడ్డు పనులకు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్‌డీ ప్రకాశ్‌నా యుడు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ చెంచయ్య, ఏపీవో శ్రీవిద్య, టీడీపీ నాయకులు గడ్డం అమర్‌నాథరెడ్డి, మురళి పాల్గొన్నారు.

బేతంచెర్ల : గ్రామీణ ప్రాంతాల్లోని పల్లెలు అభివృద్ధి ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందని గ్రామ సర్పంచ్ రామక్క, ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ అన్నారు. ఆదివారం మండలంలోని ముద్దవరం, ఎం. పెండేకల్, వీరాయపల్లె, రేపల్లె గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.


కొలిమిగుండ్ల: భూమి పూజలో పాల్గొన్న టీడీపీ మండల అధ్యక్షుడు మూలే, రామేశ్వరరెడ్డి, అధికారులు

కొలిమిగుండ్ల: టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, కల్వటాల సర్పంచ్ కామిని కృష్ణ రంగారెడ్డి దంపతులు అన్నారు. ఆదివారం కొలిమిగుండ్ల, కల్వటాల గ్రామాల్లో ఎంపీడీవో ప్రసాద రెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మూలే రామేశ్వర రెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, మందా విజయ్, అందెరాము, గూడురు నాగేశ్వరరెడ్డి, కల్వటాల సర్పంచ్ కామిని సుమలత, కామిని భాస్కరరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ దస్తగిరి, ట్రీడ్స్ రవి, చిట్టి, గోపాల్, బొట్టుస్వామి, వెంకటరాముడు,

అవుకు : కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని శింగనపల్లె టీడీపీ గ్రామ నాయకుడు సాంబశివారెడ్డి అన్నారు. ఆదివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో వెంగన్న, అధికారులు, టీడీపీ నాయకులు కలసి శింగనపల్లె, మెట్టుపల్లె, గోకులదిన్నె గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసులు, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో హనిఫా, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కోవెలకుంట్లలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి


బనగానపల్లెలో భూమి పూజ చేస్తున్న ఉపసర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ నాయకులు


ఎం.పెండేకల్‌లో సీసీ రోడ్లకు భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో, గ్రామ సర్పంచ్


మెట్టుపల్లెలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం
- డీఈ నాగ శ్రీనివాసులు



బనగానపల్లె , అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బనగానపల్లె నియోజకర్గంలో పల్లె పంచాయతీ వారోత్సవాల సందర్భంగా భూమి పూజ చేసిన పనులు త్వరిత గతిన పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు తెలిపారు. ఆదివారం డీఈ ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: బనగానపల్లె నియోజకవర్గానికి పల్లెపంచాయతీ వారోత్సవాలకు నిధులు ఎన్నికోట్లు కేటాయించారు?

జవాబు: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 23.40 కోట్లు నిధులు కేటాయించారు.

ప్ర: ఏయే మండలాలకు ఎన్ని నిధులు కేటాయించారు?

జ: బనగానపల్లె మండలానికి రూ.7.40 కోట్లు, కోవెలకుంట్ల మండలానికి రూ.4.90కోట్లు, కొలిమిగుండ్ల మండలానికి రూ.3.25 కోట్లు, అవుకు మండలానికి రూ.3.50 కోట్లు, సంజామల మండలానికి రూ.4.35 కోట్లు నిధులు కేటాయించారు.

ప్ర: ఎన్ని సిమెంట్ రోడ్లకు ఈనిధులు కేటాయించారు?

జ: పల్లె పంచాయతీ వారోత్సవాల సందర్భంగా ఐదు మండలాలకు 147 సిమెంట్ రోడ్లకు నిధులు కేటాయించారు. బనగానుపల్లెలో 39, కొలిమిగుండ్లలో 24, కోవెలకుంట్లలో 26, అవుకులో 29 , సంజామలలో 29 సిమెంట్ రోడ్లకు నిధులు కేటాయించారు.

నేడు ఇంటర్వ్యూలు

బనగానపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న వంట మనిషి, వాట్‌ఉమెన్, నైట్ వాచ్ ఉమెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నంద్యాల సెయింట్ జోసెఫ్ ఉన్నతపాఠశాలలో సోమవారం ఉదయం 9గంటలకు హాజరు కావాలని మండల విద్యాధికారి స్వరూప ఆదివారం కోరారు. తమ ఒరిజినల్, ఆధార్ కార్డు, రెసిడెన్సియల్ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, విద్యార్హతలకు సంబంధించిన పత్రాలతో హాజరు కావాలని కోరారు.

బేతంచెర్ల: మండలంలోని కస్తూర్బా పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న వంట మనిషి, వాచ్ ఉమెన్ పోస్టుల కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంఈవో సోమశేఖర్ ఆదివారం తెలిపారు. హాజరు కాని పక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు తిరస్కరించబడునని ఆయన తెలిపారు.

సభ్యత్వం తీసుకోవాలి

కోవెలకుంట్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకుని భవిష్యత్తు గ్యారెంటీ పొందాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జరగబోయే టీడీపీ కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలంలో ఆదివారం గ్రామ దేవతలు పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మ, చౌడేశ్వరి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కొండమాయపల్లె, యల్లావత్తుల, రుద్రవరం, పెద్దకంబలూరు గ్రామాల్లో ప్రత్యేకపూజలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించారు.

ముత్తలూరు గ్రామంలో..

రుద్రవరం : మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

చాగలమర్రి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని బీసీ సం ఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌ డ్ తెలిపారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అన్నారు. బీసీ కులాలను ఆర్థికంగా ఆదుకోవడంలో సీఎం మాట నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో బీసీసంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, లాలయ్య, సుబ్బరాయుడు, ధనుంజయుడు, చిన్నికృష్ణయ్య, సిద్ధప్ప పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

కొలిమిగుండ్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : అంకిరెడ్డిపల్లెలో దానమయ్య అనే నాటుసారా విక్రేతను అ రెస్ట్ చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. గ్రామంలోని చింతలాయపల్లె ర హదారిలో నాటుసారా విక్రయిస్తుండగా అ రెస్ట్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తగ్గిన వాన ఉధృతి

సంజామల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజు లుగా కురుస్తున్న భారీ వర్షాలకు సంజామల సమీపంలో పాలేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఆది వారం కాస్త ప్రవాహం తగ్గడంతో ఆటోల రాకపోకలు కొనసాగుతున్నాయి. గొల్లలేరు డ్రైయిన్ కట్ట తెగిపోవడంతో పంటలు నీట మునిగాయి.